అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 26 । నవంబర్ । 2022



తెలవారదేమి.. 8లో

- ఉదయం 11 గంటల వరకు వీడని మంచుతెరలు
- అందాలను వీక్షించిన ప్రకృతి ప్రేమికులు



భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే 8లో

బాధిత కుటుంబానికి ప్రభుత్వ భూమి

బాలిక తండ్రికి పట్టా పంపిణీ 8లో



పట్టా అందజేస్తున్న తహసీల్దార్ ప్రసాద్, ఎంపీపీ అనూషదేవి

న్యూస్‌రీల్

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొంటారు. శనివారం ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఒకటో స్థాయి సంఘం సమావేశం జరుగుతుంది. 2022–2023 సంవత్సరం సవరణ బడ్జెట్, 2023–2024 అంచనా బడ్జెట్ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నట్టు సీఈవో వివరించారు.

నేటి నుంచి వంజంగి హిల్స్‌కు అనుమతించం

కళ్లలబయలు గిరిజనులు స్పష్టీకరణ

సాక్షి, పాడేరు: పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన వంజంగి హిల్స్‌కు శనివారం నుంచి పర్యాటకులకు అనుమతి ఇవ్వమని కళ్లలబయలు గిరిజనులు శుక్రవారం తెలిపారు. పర్యాటకంగా వంజంగిహిల్స్ గుర్తింపు పొందినప్పటికీ తమకు ఎటువంటి ఉపాధి లేకపోవడంతో గ్రామస్తులందరం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా వారు తెలిపారు.

నేడు, రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

సాక్షి, పాడేరు: ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుమూడి విక్టర్ ప్రసాద్ జిల్లాలో ఈనెల 26, 27 తేదీల్లో పర్యటిస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం చీపురుపల్లిలో బయలుదేరి రాత్రి 9 గంటలకు అరకువేలి చేరుకుంటారని తెలిపారు. 27న ఉదయం 9 గంటల నుంచి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి మచిలీపట్నం వెళ్తారని ఆయన పేర్కొన్నారు.

అమ్మవారికి త్రిశూలం సమర్పణ



త్రిశూలాన్ని సమర్పిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

సాక్షి, పాడేరు: మన్యం ప్రజలు ఆరాధ్యదైవమైన మోదకొండమ్మ తల్లి అమ్మవారికి పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, తన తండ్రితో కలిసి శుక్రవారం త్రిశూలాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంగురాళ్ల తవ్వకందారుల అరెస్టు

అడ్డతీగల: మండలంలోని తపస్వీకొండ రక్షిత అటవీ ప్రాంతంలోని బిళ్లమాను క్వారీ వద్ద రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడుతున్న మండలంలోని దుప్పులపాలెంకు చెందిన ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. తపస్వీకొండ రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించామని చెప్పారు. తమ రాకను గమనించిన తవ్వకందారుల్లో కొంతమంది పరారైనట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని దుప్పులపాలెంకు చెందిన ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి తవ్వకాలకు ఉపయోగించే పరికరాలను స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు. రక్షిత అటవీ ప్రాంతాల్లో చట్టవిరుద్ధమైన రంగురాళ్ల తవ్వకాలకు పాల్పితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రుణాలు సద్వినియోగం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచన



లబ్ధిదారులకు రుణాల చెక్కును అందిస్తున్న ఐటీడీఏ పీవో, ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ కోరారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలోని ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ హామీ కార్యక్రమంలో భాగంగా ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.17.56 లక్షల మేర రుణాలను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అభిషేక్, డీఆర్వో దయానిధి, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఎల్‌డీ రవితేజ, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సాగులో మేటి..

- ఆధునిక సేద్య పద్ధతులు పాటిస్తున్న గిరి రైతులు
- సేంద్రియ విధానంలో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు
- కొనుగోలుకు పోటీపడుతున్న వ్యాపారులు
- ఐటీడీఏ, ఉద్యానవనశాఖ సహకారంతో ఆర్థికాభివృద్ధి

గిరిజన ప్రాంతం అయినప్పటికీ ఆధునిక విధానాలు, సేద్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సేంద్రియ విధానంలో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. అందుకు తగ్గట్టుగానే మంచి ఆదాయం పొందుతున్నారు.



బంగాళదుంప సాగులో నిమగ్నమైన గిరి రైతులు



మార్కెట్‌కు తీసుకువచ్చిన అల్లం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. వీటిని మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం కూరగాయ పంటలతో మన్యం కళకళలాడుతోంది. దిగుబడులు ప్రారంభం కావడంతో వారపు సంతల్లో సందడి నెలకొంది.

వెయ్యి హెక్టార్లలో

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో సుమారు వెయ్యి హెక్టార్లలో కూరగాయలను పండిస్తున్నారు. ఉద్యానవనశాఖ అందిస్తున్న సహకారాన్ని వారు సద్వినియోగం చేసుకుంటున్నారు. రాయితీపై విత్తనాలు, సాంకేతిక సహకారం అందిస్తోందని రైతులు తెలిపారు. పాడేరు డివిజన్‌లో డుంబ్రిగుడ మండలంలో సొవ్వ, సాగర, కించుమండ, కొర్రాయి, హుకుంపేట మండలంలో రంగశీల, సంతారి, అరకులోయ మండలంలో చినలబుడు, పెదలబుడు, భస్కి, సుంకరమెట్ట, మాడగెడ్డ, అనంతగిరి మండలంలో కాశీపట్నం, ముంచంగిపుట్టు మండలంలో దోనెపుట్టు, జీకేవీధి మండలంలో ధారకొండ, గుమ్మిరేవుల, రింతాడ ప్రాంతాల్లో రైతులు కూరగాయల సాగులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

వారపు సంతలే కీలకం

డివిజన్ పరిధిలో పండిస్తున్న కూరగాయ రైతులకు వారపు సంతలే కీలకం. పాడేరు రోజువారీ మార్కెట్‌తోపాటు కాశీపట్నం, సుంకరమెట్ట వారపు సంతల్లో కూరగాయల అమ్మకాలు భారీగా జరుగుతాయి. కొంతమంది రైతులు ఉద్యానవనశాఖ, ఐటీడీల సహకారంతో విశాఖ నగరంలోని రైతు బజార్లకు కూడా తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు.

పాడేరు మార్కెట్ కిటకిట

వ్యవసాయ, కూరగాయ ఉత్పత్తుల అమ్మకాలతో శుక్రవారం మార్కెట్ కిటకిటలాడింది. కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతులను విక్రయించారు. మైదాన, స్థానిక వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. బస్తరు పిక్కలు, కొత్త అల్లం, నాగలి దుంపలు, తియ్యదుంపలు, క్యారెట్, గుమ్మడికాయలు, బీన్స్ వ్యాపారం అధికంగా జరిగింది.

- బస్తరు పిక్కలు కిలో రూ.90 నుంచి 100, కొత్త అల్లం కిలో రూ.25, తియ్య దుంపలు బస్తా రూ.400 నుంచి 500, నాగలిదుంపలు కిలో రూ.10, క్యారెట్ బస్తా రూ.600 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు.
- కాలిఫ్లవర్ బుట్ట 20 కిలోలు రూ.300 చొప్పున గిరి రైతులు విక్రయించారు. గుమ్మడి కాయలు, బీన్స్, పచ్చిమిర్చి, టమాటా, కొత్తిమీర, తోటకూర విక్రయాలు భారీగానే జరిగాయి.

ఆశాజనకంగా ధరలు



పాడేరు మార్కెట్‌లో శుక్రవారం అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించింది. బస్తరు పిక్కలు, చిలగడ, నాగలి దుంపలను మంచి ధరకు కొనుగోలు చేశారు. కార్తీకమాసంలో మంచి ధరలు వచ్చాయి. ప్రస్తుతం అప్పటి కన్నా ధరలు తగ్గినా ఆశాజనంగానే ఉన్నాయి.

–వంతాల రామ్, గిరిజన రైతు, శ్రావణీ నగర్, జి.మాడుగుల

ఆధార్ అప్‌డేట్ వేగవంతం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- బూదరాళ్ల సచివాలయం సందర్శన
- బాధ్యతగా పనిచేయాలని ఆదేశం



బూదరాళ్ల పంచాయతీలో సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సుమిత్‌కుమార్

కొయ్యూరు: ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన రంపచోడవరం నుంచి పాడేరు వెళ్తూ మార్గంమధ్యలో బూదరాళ్ల సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరు వివరాలను తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలన్నీ మారుమూల కావడంతో బ్యాంకు ఖాతాలు లేని వారు వివరాలు తెలపాలన్నారు. బ్యాంక్ ఖాతాలు లేనివారి వివరాలతోపాటు రన్నింగ్‌లో లేని ఖాతాల వివరాలు సేకరించి తమకు నివేదిక అందజేయాలని సచివాలయ కార్యదర్శి, సంక్షేమ సహాయకులను ఆదేశించారు. ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం గ్రామాల్లో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని తాగునీరు, రహదారులు, కమ్యూనికేషన్ తదితర సమస్యలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై కూడా నివేదిక అందజేయాలని ఆయన సూచించారు. విధుల నిర్వహణలో సిబ్బంది బాధ్యతగా పనిచేయడమే కాకుండా సమయ పాలన పాటించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఆదేశించారు.

టీడీపీ కనుమరుగు ఖాయం



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- ఆయన సమక్షంలో టీడీపీ, తదితర పార్టీల నేతలు భారీగా చేరిక

పెదబయలు: ఏజెన్సీలోని టీడీపీ కనుమరుగు కానుందని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జోస్యం చెప్పారు. మండలంలోని పోయ్యిపల్లి పంచాయతీ జల్లెలపుట్టు, సలుగుపుట్టు, సాకిరేవ్, అర్లబ్ గ్రామాలకు చెందిన టీడీపీ, వివిధ పార్టీలకు చెందిన 187 కుటుంబాల గిరిజనులు, ఎంపీటీసీ పూర్ణరావు, సర్పంచ్ బొండ చిట్టి, ఉపసర్పంచ్ బొండ అప్పరాజు, బుల్లిదొర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ టీడీపీ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. క్షేత్రస్థాయిలో సైతం పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న అక్కసుతో కోడి కత్తితో దాడి
- లోతుగెడ్డలో ఘటన



శ్రీనివాస్ (ఫైల్)

చింతపల్లి: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్న అక్కసుతో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన కలకలం సృష్టించింది. శుక్రవారం లోతుగెడ్డలో చోటుచేసుకున్న ఘటనలో సరమండ దిలీప్‌కుమార్ అదే గ్రామానికి చెందిన పేరురి శ్రీనివాస్ (39)ను కోడి కత్తితో దాడి చేసి హతమార్చాడు. వివరాలిలావున్నాయి. గ్రామంలో వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడిన దిలీప్ కుమార్ మద్యం మత్తులో శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. ఇంటి బయట ఎండబెట్టి ఉన్న గళ్ల ఉప్పును చెల్లాచెదురు చేస్తుండగా శ్రీనివాస్ భార్య కుమారి వారించింది. ఆమెపై ఉప్పు పోయడంతో భర్త శ్రీనివాస్ అతనితో ఘర్షణకు దిగాడు. దీంతో అతడిపై దిలీప్‌కుమార్ దాడికి పాల్పడి పక్కకు నెట్టేశాడు. దీనిపై బాధితుడు శ్రీనివాస్ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న దిలీప్‌కుమార్ కోడి కత్తి పట్టుకుని శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న అక్కసుతో అతని చాతీ, పొట్టపై బలంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దిలీప్ కుమార్ మొదటి నుంచి మద్యం సేవించి అందరితోనూ గొడవకు దిగుతుంటాడని గ్రామస్తులు తెలిపారు. హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నవరం ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- 95 అర్జీల స్వీకరణ



స్పందనలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: త్వరితగతిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అభిషేక్‌తో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందన కార్యక్రమానికి నిర్దిష్టమైన సమయానికి హాజరుకావాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో అభివృద్ధిపై అంచనాలు ఎక్కువగా ఉంటాయని, గిరిజనులు ఆకాంక్షలకు తగ్గట్టుగా పనులు చేపట్టాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ కొండలరావు, ఏపీవో ప్రభాకరరావు, ఈఈ ఆర్‌ఎం రాజు, డీఎల్పీవో కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందరబాబు, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్, జీసీసీ డీఎం పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

స్పందనలో అర్జీదారులు నుంచి 95 వినతులు స్వీకరించారు. హుకుంపేట మండలం గన్నేరుపుట్టు సర్పంచ్ కృష్ణారావు, మదుము గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. కమ్యూనిటీ భవనం మంజూరుచేయాలని కొయ్యూరు మండలంలోని డొనూరు పంచాయతీ తులబడ గ్రామానికి చెందిన శంకరరావు, చంద్రమ్మ కోరారు.

- కొయ్యూరు మండలంలోని మూలపేట, కుమ్మర్ల, జాజులబంద, ధారగెడ్డ, పాలమామిడి,పోర్లుబంద గ్రామాలకు మెటల్‌రోడ్డు మంజూరుచేయాలని జెడ్పీటీసీ వారా నూకరాజు, చిట్టిబాబు కోరారు. అంతేకాకుండా గొట్టెలపాడు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.
- దివ్యాంగుల పింఛన్ మంజూరుచేయాలని చింతూరుకు చెందిన భరణి కోరారు.

అటవీశాఖ అధికారులపై దాడులు సరికాదు

డీఎఫ్‌వో సాయిబాబా



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీఎఫ్‌వో, అటవీ సిబ్బంది

చింతూరు: అందరికీ ఎంతో ఉపయోగకరమైన అటవీ వనరులను సంరక్షిస్తున్న అటవీ అధికారులపై దాడులు చేయడం ఎంతవరకు సబబని చింతూరు అటవీ డివిజన్ డీఎఫ్‌వో సాయిబాబా అన్నారు. తెలంగాణలో ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావుపై వలస గొత్తికోయలు దాడిచేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీ ఉద్యోగులు శుక్రవారం చింతూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి సిబ్బంది అడవులను కాపాడుతున్నారని, ఆక్రమణలను అడ్డుకుంటున్న తమ సిబ్బందిపై దాడులు చేయడం సరైనది కాదని ఆయన తెలిపారు. అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో విజయలక్ష్మి, నాలుగు మండలాలకు ఎఫ్‌బీవో, ఏబీవో, హెల్పర్లు పాల్గొన్నారు.

జీడిమామిడిలో సస్యరక్షణే కీలకం

పందిరిమామిడి కేవీకే శాస్త్రవేత్త చిరంజీవి



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త చిరంజీవి



శిక్షణకు హాజరైన రైతులు

రాజవొమ్మంగి: జీడిమామిడిలో అధిక దిగుబడిలో సమగ్ర సస్యరక్షణ కీలకమని పందిరి మామిడి కేవీకే (రంపచోడవరం) శాస్త్రవేత్త డాక్టర్ చిరంజీవి సూచించారు. శుక్రవారం మండలంలోని చినరెల్లంగిపాడులో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ముదురు జీడిమామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపు చేపట్టాలని సూచించారు. బీపీటీ–8, –9 రకాల సాగు ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. ఈ రకం అంటు మొక్కలు రంపచోడవరం పందిరి మామిడి కేవీకేలో ఉన్నాయన్నారు. ఒకొక్కటి రూ.50కు లభిస్తుందన్నారు. నేలను బాగా దున్ని మొక్కకు మొక్కకు మధ్య ఏడు మీటర్ల దూరం ఉండేలా నాటుకోవాలని సూచించారు. కనీసం మీటరు లోతు ఉండేలా గుంతలు తవ్వి మొక్క నాటిన తరువాత పశువుల ఎరువు కలిపిన మట్టితో కప్పాలన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గిరిజన రైతులను జీడిమామిడి తోటల పెంపకంలో ప్రోత్సహిస్తున్నట్లు ఉపాధి ఏపీవో సురేష్ కుమార్ రైతులకు తెలిపారు. పెరటి తోటల పెంపకం ఎంతో లాభదాయకమని రంపచోడవరం హార్టీకల్చర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. చిట్టిబాబు సూచించారు. ఎంపీటీసీ చుండ్రు లోవలక్ష్మి, వీహెచ్‌ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

జెండా కొండ అందాలు అద్భుతం

- 'కలర్ ఫొటో' హీరో సుహాస్
- స్నేహితులతో కలిసి సందడి



సీతమ్మపర్వతంపై మంచు అందాలు, సూర్యోదయాన్ని పర్యాటకులతో కలిసి తిలకిస్తున్న సినిమా హీరో సుహాస్

హుకుంపేట: పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న జెండా కొండ (సీతమ్మ పర్వతం) అందాలు అద్భుతమని కలర్ ఫొటో సినిమా హీరో సుహాస్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయన స్నేహితులతో కలిసి ఇక్కడ బస చేశారు. శుక్రవారం వేకువజామున వారు ప్రకృతి అందాలను తిలకించారు. ఇదే ప్రాంతంలోని థింసా రాళ్లు, తేనెపట్టు గుహలు, కొండ దిగువన హండీ, గడ్డి గుమ్మి, గొడుగురాయి జలపాతాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ జెండా కొండ అందాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ ప్రాంతంలో లొకేషన్లను సినిమాలో చిత్రీకరించేందుకు ప్రాధాన్యమిస్తామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతంలో షూటింగ్ చేపడతామని చెప్పారు.

ఆడపిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



ఐటీడీఏ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఆడపిల్లలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొని, ప్రత్యేక చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రంపచోడరంలో మహిళల పట్ల వివక్షత, బాల్య వివాహాలు నిర్మూలన, గృహహింస, మహిళలపై వేధింపులు తదితర అంశాలపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఐటీడీఏ కార్యాలయం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దిశ వంటి యాప్‌లను కూడా అందుబాటులో తెచ్చిందన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయిలోనే బాలికలకు మహిళ చట్టాలు, బాల్య వివాహాలు వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు తదితర కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. డిసెంబరు 1 వరకు గ్రామాల్లో లింగ వివక్షతపై ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు2 నుంచి 8వ తేదీ వరకు బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీలు, డిసెంబరు 9 నుంచి 15 వరకు లైంగిక నేరాల నియంత్రణపై ర్యాలీలు, డిసెంబరు 16 నుంచి 23 వరకు గృహహింస నిర్మూలనపై అవగాహన ర్యాలీల కార్యక్రమం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సీడీపీవో సంధ్యారాణి, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎంవీర్ కుమార్‌బాబు, డీపీఎం అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. చాపగెడ్డ గ్రామానికి చెందిన వెంకటరమణ, ప్రసాద్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై చాపగెడ్డనుంచి అద్దరవీధి గ్రామంలో జరిగే గడప గడపకూ కార్యక్రమానికి వెళుతుండగా జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం వెళుతున్న వాహనాన్ని మలుపులో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ అంబులెన్సులో గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

సర్వీసు ప్రొవైడర్ల దరఖాస్తులకు గడువు పెంపు

సాక్షి, పాడేరు: పెట్రోల్ బంకుల్లో సర్వీసు ప్రొవైడర్ల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 26 వరకు గడవు పెంచినట్టు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ శుక్రవారం ప్రకటనలో కోరారు. కొంతమంది గిరిజనులు అభ్యర్థన మేరకు గడువును పొడిగించామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

46 క్వింటాళ్ల అక్రమ నిల్వ బియ్యం పట్టివేత

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో కిరాణా వ్యాపారి అప్పారావు అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని తహసీల్దారు తిరుమలరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తే అక్రమంగా నిల్వ ఉంచిన 46 క్వింటాళ్ల బియ్యం బయటపడ్డాయన్నారు. వాటిని గోడౌన్‌కు తరలించామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ భూమి

చింతపల్లి: ప్రమాదవశాత్తూ పునాదుల్లో పడి మృతి చెందిన బాలిక చిన్నారి కుటుంబానికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించినట్టు తహసీల్దార్ ప్రసాద్, ఎంపీపీ కొరాబు అనూషదేవి తెలిపారు. మండల కేంద్రమైన చింతపల్లికి చెందిన చెండా వీరయ్య కుమార్తె చిన్నారి (3) ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ స్థానిక ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద భవనాల పునాదుల్లో పడి మృతి చెందింది. దీంతో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె తండ్రి అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు అతనికి మూడు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు పట్టాను శుక్రవారం తహసీల్దార్, ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, వీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు

రంపచోడవరం: భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. శుక్రవారంఆయన భూపతిపాలెం ప్రాజెక్టు కెనాల్‌ను పరిశీలించారు. సీతపల్లి వాగు ద్వారా సిరిగిండలపాడు, ముసురుమిల్లి ఆర్అండ్ఆర్ కాలనీ మీదుగా కాలువకు ఇరువైపులా రైతులు వ్యవసాయం చేసుకునేలా కెనాల్‌కు మరమ్మతులు చేపడతామన్నారు. భూపతిపాలెం ప్రాజెక్టు కెనాల్‌కు మరమ్మతులు చేపట్టాల్సిన పనులు వివరాలను ఇరిగేషన్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. కాలువకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కెనాల్ దిగువున రైతు, సాగు భూముల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.

పునరావాస కాలనీల సందర్శన

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు నిర్మించిన పునరవాస కాలనీలను రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ శుక్రవారం సందర్శించారు. ముసుళ్లకుంట, కంబలంపాలెం వద్ద నిర్మించిన పునరవాస కాలనీ వాసులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాలను ఆయన పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్వాసితుల అభీష్టం మేరకు ప్రత్యామ్నాయ స్థలాలు పరిశీలించాలని తహశీల్దార్ వీరభద్రరావును ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించిన ఆర్టీఐ కమిషనర్



శ్రీనూకాంబికను దర్శించుకున్న సహ చట్టం రాష్ట్ర కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి

తుమ్మపాల: సమాచార చట్టం రాష్ట్ర కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ లక్ష్మినగేష్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. శ్రీ గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించి ఆర్టీఐ చట్టం గురించి వివరించారు.

కొండలెక్కి.. గెడ్డలు దాటి



పినలువ్వాసింగిలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్‌కుమార్



బలపాంలో గెడ్డను దాటుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్

జి.మాడుగుల: కొండలు ఎక్కి.. ప్రమాకరమైన గెడ్డలు దాటి శివారు గిరిజన గ్రామాలను సందర్శించి గిరిజనులకు తాగునీరు అందించి శభాష్ అనిపించుకున్నారు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి విజయ్‌కుమార్. మండలం పెదలువ్వాసింగి పంచాయతీలో శుక్రవారం శివారు గ్రామాలైన పినలువ్వాసింగి, ఎస్తాలు, వంద్రంగిపాడు, సోపాలు, కిల్లుపల్లి, పార్లుగుంట, కందులగాది, వసబంద గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద మంజూరైన తాగునీటి పనులను మండలానికి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ పూర్తిచేసి ఇంటింటికీ కుళాయి ప్రక్రియన ప్రారంభించారు. ఆయా గ్రామాలకు చేరేందుకు సుదూర ప్రాంతాల్లో కాలినడకన, అలాగే ప్రమాకరంగా ప్రవహిస్తున్న బలపాం గెడ్డ, సోపాలు గెడ్డలను ఏఈతో పాటు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కొండపల్లి సత్యనారాయణ కలిసి దాటారు. గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించడంతో ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. తాగునీటి సదుపాయం కల్పించటానికి చర్యలు చేపట్టిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్‌ను అభినందించారు.

తెలవారదేమి..



మంచు ముసుగులో అనంతగిరి

అనంతగిరి: మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు కూడా మంచు ముసుగు వీడలేదు. దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో అరకు–విశాఖ ప్రధాన రహదారిలో వాహనచోదకులు లైట్ల వెలుగులో ప్రయాణాలు సాగించారు. పర్యాటకులు మంచు అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగారు. రాజవొమ్మంగి పరిసరాల్లో శుక్రవారం ఉదయం 9 గంటలు దాటినా మంచు తెరలు వీడలేదు. గురువారం వర్షం కురిసింది. రాత్రి నుంచి మంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం ఆలస్యమైంది.

మెనూ సక్రమంగా అమలు

డీడీ శ్రీనివాసరావు



నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీడీ శ్రీనివాసరావు

చింతూరు: ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన చింతూరులోని నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర ఎస్ఎం హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్లాస్‌రూంలు, స్టోరు రూంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఫేసియల్ అటెండెన్స్ వేయాలని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిషోర్, డీఎస్‌వో కుమార్ పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ, జుత్తాడ గ్రామాల్లో శుక్రవారం జరిపిన దాడులలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 15 యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు అందచేసిన వివరాల ప్రకారం అక్రమ ఇసుక రవాణాను నిరోధించడానికి ఆయా గ్రామాల్లో శారదా నదిలో దిగే రహదారుల వద్ద ట్రెంచ్‌లను తవ్వించామన్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను చోడవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

లైంగిక వేధింపులపై కఠిన చట్టాలు అవసరం



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర



సభలో ప్రసంగిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ దక్షిణ): లైంగిక వేధింపులపై కఠిన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళలపై హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వచ్చేనెల 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలు పని చేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురికాకుండా(నివారణ–నిషేధం–పరిహారం) చట్టం–2013 అమలు చేయాలన్నారు. జిల్లాలోని మహిళలందరికీ వేధింపుల చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. మంచి, చెడు స్పర్శలకు మధ్య ఉన్న తేడాను ఆడ పిల్లలకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ దిశా యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులకు గురైతే తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులి కృష్ణ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ చైర్‌పర్సన్ మంతెన మాధవీ వర్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చిన్మయిదేవి, దిశా పోలీస్ స్టేషన్ ఏసీపీ వివేకానంద, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాధాకుమారి, మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో ఘనంగా సుదర్శన హోమం



గరుడాద్రిపర్వతం మూలవిరాట్ సన్నిధిలో నిర్వహిస్తున్న సుదర్శన హోమం

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయం ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం సుదర్శన హోమం అత్యంత ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం, రాష్ట్రం, గ్రామం సుభిక్షంగా ఉండాలని, మరింత అభివృద్ధి చెంది ప్రజలు, పాలకులు సుఖసంతోషాలతో జీవించాలని ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు 40 రోజుల పాటు సుదర్శన శతక పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడాద్రి పర్వతంపై వెలసిన శ్రీ కల్కి వేంకటేశ్వరస్వామి మూలవిరాట్ సన్నిధిలో సుదర్శన హోమం పంచ సూక్తహోమం నిర్వహించారు. ఉదయం కొండ దిగువనున్న ఆలయం నుంచి సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా గరుడాద్రి పర్వతంపై ఉన్న మూలవిరాట్ వేంకటేశ్వర స్వామి సన్నిధికి తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి, సుదర్శన పెరుమాళ్లకు ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. తదుపరి సుదర్శన హోమం, పంచసూక్త హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కొండ దిగువన ఆలయంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వెంకటశేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యుల ఆధ్వర్యంలో బాలభోగ నివేదన, రాజభోగ నివేదన, తీర్థగోష్ఠి అనంతరం సుమారు 200 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం విజయవాడ జోన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటయ్య పాల్గొన్నారు.